# 61

# తగిన శాస్తి

రైలు ప్లాట్‌ఫారం మీద ఆగివుంది.

రాజు పెట్టె, బెడ్డింగ్ కూలీవాడి నెత్తిన పెట్టి హడావుడిగా తన బోగీని వెదకడం మొదలుపెట్టాడు. ఎక్కువ శ్రమ పడకుండానే తన బోగీని గుర్తుపట్టాడు. సామానుని లోపల పెట్టించి బయటికి వచ్చాడు.

"హల్లో రాజా!" అంటూ పలకరించాడు ప్రకాష్.

వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్.

"హలో ప్రకాష్... ఏమిటి ఇలా వచ్చావు?" అని అడిగాడు రాజు.

"మా ఊరు వెళ్తున్నాను. నా ట్రెయిన్ గంట లేటట. అందువల్ల ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తూంటే నువ్వు కనిపించావు. మరి నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు?" అన్నాడు ప్రకాష్.

"నేను హైదరాబాదు వెళ్తున్నాను. అక్కడ నాకు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. మంచి జాబ్ వస్తుందన్న నమ్మకం నాకుంది" అన్నాడు రాజు.

"వెరీగుడ్. అడ్వాన్స్ కంగ్రాట్స్!" అన్నాడు ప్రకాష్.

"థాంక్స్..!" అంటున్న రాజు కంటికి అటుగా వెళ్తున్న అరటిపళ్ళ బండి కనిపించింది.

అరడజను అరటిపళ్ళు కొని, వద్దన్నా వినకుండా మూడు పళ్ళు ప్రకాష్ చేతిలో పెట్టాడు.

ఆకలిమీద వున్నాడో, ఏమో.., వెంటనే పండు తినడం మొదలు పెట్టాడు. పండు తిని ఆ తొక్కని అక్కడే ప్లాట్‌ఫారం మీద పడేశాడు.

ప్రకాష్ అది గమనించాడు.

'అదేం పని?' అని అడుగుదామనుకున్నాడు. కాని, అడగడానికి మొహమాటపడ్డాడు.



పోనీ- ఆ తొక్కని తానే క్రిందికి తోద్దామనుకున్నాడు. కాని, అలాచేస్తే రాజుని అవమానించి నట్లనిపించుకోవచ్చునని ఊరుకున్నాడు.

పరోక్షంగా జ్ఞాపకం చేసే ఉద్దేశంతో తానూ ఒక పండు తిని, ఆ తొక్కని జాగ్రత్తగా క్రిందకు తోశాడు. రాజు అది గమనించాడే కాని, దానినేమీ పట్టించుకోలేదు.

మిత్రులిద్దరూ మాటల్లో వుండగా రైలు కదిలింది.

కంగారుగా ప్రకాష్‌కి గుడ్‌బై చెప్పి కదుల్తున్న రైలులో ఎక్కడానికి పరుగు లంకించుకున్నాడు రాజు. రెండడుగులు వేశాడో, లేదో... "అమ్మో!" అని గట్టిగా అరుస్తూ జర్రున జారి, మంచు మీద స్కేటింగ్ చేసేవారిలాగా పడ్డాడు.

అదృష్టం బాగుండి రైలు క్రింద పడలేదు. ప్లాట్‌ఫాం మీదనే పడ్డాడు. కాని, తొడ ఎముక విరిగింది. సామానుతో రైలు వెళ్లిపోయింది. అంత పనిచేసింది... అతను అజాగ్రత్తగా పడవేసిన అరటిపండు తొక్క!

నలుగురితోపాటు ప్రకాష్‌కూడా అక్కడికి పరుగెత్తుకు వచ్చాడు.

నిజానికి, రాజు రైలెక్కాక తానే ఆ తొక్కని క్రిందకు తోసేద్దామనుకున్నాడు ప్రకాష్. కాని, ఇంతలోనే ఇంతపని జరిగింది. తన ప్రయాణాన్ని మానుకుని రాజుని రైల్వే ఆస్పత్రికి తరలించడం, తన సామాను కోసం ఫిర్యాదు చేయడం... ప్రకాష్ వంతు అయింది. ఉద్యోగం రాకపోగా ఆస్పత్రి పాలు అవడం రాజు వంతయింది.

చేతులారా చేసుకున్నందుకు చేతులెత్తి నెత్తి కొట్టుకున్నాడు రాజు.

★★★

